


# ప్రియురాలు పిలిచె

– డా.యండమూరి వీరేంద్రనాథ్



## (గత సంచిక తరువాయి)

ఆమె గతుక్కుమని ''తప్పు. అలా అనుకోవటం లేదు'' అంది గర్వంగా. 'హమ్మయ్య బ్రతికించారు' అనుకున్నాడు మనసులో. నిజానికి తీసెయ్యాలనే అనుకుంది.

కార్తికేయ ఆమె దగ్గర చేరి పది రోజులయ్యాక ఒక రాత్రి..... వర్షం కుండపోతగా కురుస్తోంది. ఆ రాత్రి ఆమె పాలిట కాళరాత్రి అయింది. తొమ్మిదిన్నరకి గుండెల మధ్య సన్నటి మంట మొదలైంది. బయట వర్షం ధారాపాతంగా కురుస్తున్నా ఆమె శరీరం చమటతో తడిసిపోయింది. గొంతులోకి లాగేస్తున్నట్టు నాలుక వెనక్కి వెళ్ళిపోతోంది. అయిదు నిమిషాలయ్యేసరికి శరీరం స్వాధీనం తప్పింది. వంటి మీద నైటీ తీసి విసిరేసి ప్రక్కనే స్టూల్ మీదున్న వాటర్ జగ్‌లో నీళ్ళు మొహం పై నుంచి వంటి మీదకు వంపుకుంది. మొహం మీద నీళ్ళు పడగానే కాస్త స్పృహలోకి వచ్చింది కానీ క్షణం సేపే. ఆమె చెయ్యి ఇంటర్‌కమ్ మీద పడింది. తరువాత ఏం జరిగిందో ఆమెకి తెలీదు.

విడవకుండా వినపడుతూన్న ఇంటర్ కమ్ శబ్దానికి అప్పుడే మాగన్నుగా నిద్ర నిద్రలోకి జారుకుంటున్న కార్తికేయ లేచి, ఒక్క ఉరుకులో మేడ మీదకు పరిగెత్తాడు. మంచం మీద నగ్నంగా ఉన్నదామె. ఊహించని ఆ దృశ్యానికి తత్తరపడి, అడుగు ముందుకి వెయ్యటానికి తటపటాయిస్తూ గుమ్మం దగ్గరే ఆగాడు.

తల దగ్గర దిండు క్రిందికి జారి దిండు వెన్నెముక క్రిందికి వెళ్లటంతో, వంగిన శరీరం ఎక్కుపెట్టిన విల్లులా ఉంది. స్థనాగ్రాన్ని చూస్తే టెన్సింగూ, పొత్తి కడుపుని చూస్తే భగీరథుడూ, మెడ వంపు నునుపుని చూస్తే షాజహానూ, తమ పనులు అసంపూర్ణం అనుకునేలా ఉంది ఆ భంగిమ.

మైకెలాంజిలో ఉలి రాత్రింబవళ్ళు నిర్విరామంగా చెక్కిన 'పియటా' శిల్పపు నునుపుదనాన్ని ఆమె శరీరం ఆపాదించుకుంది. శరీర వంపుల మీద కదలాడే నీడ కూడ ఆ నునుపుదనానికి కోరికను సంతరించుకున్నట్టు ఉంది. రెండు మేఘాల రాపిడిలో ఆ గదిలోకి జారిన మెరుపు కిరణం... ఆ అందమైన శరీరపు మెలికల్లో, ముడతల్లో, చీకటి కోణాల్లో నిక్షిప్తమై పోయింది. ఆమె అపురూపమైన అందగత్తె కాదు. కానీ పూర్తి ఆరోగ్యవంతురాలు. స్త్రీ కి అందం కేవలం మొహంలోనే ఉండదు. సకల చరాచరరాసులతో పాటుగా స్త్రీని సృష్టిస్తున్నప్పుడు తానో అద్భుతమైన ఆకారాన్ని భూమికి

ప్రెజెంట్ చేస్తున్నానని దేవుడు అనుకుని ఉండడు. కుంచెని రంగుల్లో ముంచి ఒక చిత్రానికి శ్రీకారం చుట్టినప్పుడు అది 'మోనాలిసా'గా రూపుదిద్దుకుంటుందని లేనార్డో–డా–విన్సీ అనుకుని ఉండడు.

అతడు వడిగా ఆమె దగ్గరకి వెళ్ళాడు. ఆమె కళ్ళు మూసుకుని ఉంది. ఆమె చెయ్యి ఇంకా అలా ఇంటర్‌కమ్ మీదే ఉంది. బయట చలికి లోపలి గాలి ఘనీభవించింది. నీలంరంగు బెడ్‌షీట్ మీద ఆమె తెల్లటి శరీరం, ఆకాశం నుంచి చూస్తే కనపడే నది మధ్య దీవిలా ఉంది. ఒక గొప్ప నవల తాలూకు ఆఖరివాక్యం సరిగ్గా కుదరక– అసహనంతో వళ్ళు విరుచుకునే రచయిత ఇరిటేషన్ ఆమె పడుకున్న భంగిమలో ఉంది.

అయితే ఆ అపురూప భంగిమని అతడు చూడటం లేదు. ఆ 'అసందర్భానికి' కారణం ఆలోచిస్తూ, ఇంటర్‌కమ్ మీద నుంచి చేయి తీయబోయి, విద్యుద్ఘాతం తగిలినవాడిలా ఆగిపోయాడు. ఆమె శరీరం సలసలా కాలిపోతోంది. అది జ్వరం కాదు. పెదవులు నల్లగా కమిలిపోయి ఉన్నాయి. అరగంట ముందు మామూలుగానే ఉంది. ఇంతలోనే వచ్చిన ఈ అస్వస్థతకి కారణం స్వాభావికం కాదని అతనికి అర్థమైంది. నైటీ తీసి ఆమె శరీరంమీద కప్పే ప్రయత్నం కూడా చేయలేదు. రెప్పలు పైకెత్తి చూశాడు.

అతడి అనుమానం నిజమైంది. మెరుపు వేగంతో క్రింద వంటింట్లోకి పరిగెత్తి ఉప్పునీళ్ళు కలిపి తీసుకొచ్చాడు. తలని ఒళ్ళోకి తీసుకుని ఆ నీటిని పట్టించే ప్రయత్నం చేశాడు. అప్పటికే నరాలమీద ఒత్తిడి ప్రారంభం కావటంతో, పళ్ళు గట్టిగా కరుచుకుపోయి ఆమె గుటక వేయలేదు. అతడామెను వదలి, లోపల బాత్‌రూమ్‌లోకి వెళ్ళి టబ్‌లో నీళ్ళు వదిలి, మళ్ళీ బెడ్‌రూమ్‌లోకి వచ్చాడు. ఒక చెయ్యి మోకాళ్ళ క్రింద మరొక చెయ్యి మెడ క్రిందా వేసి పసిపాపని పైకి లేపినట్టు లేపి బాత్‌రూమ్‌లోకి తీసుకెళ్ళి టబ్‌లో దింపాడు. మొహంతో సహా ఆమె శరీరం పూర్తిగా నీళ్ళలోకి వెళ్ళిపోయింది.

అరక్షణం తరువాత ఆమెలో కదలిక ప్రారంభమైంది. ముక్కులోకి నీళ్ళు రావడంతో అప్రయత్నంగా నోరు తెరిచింది. అప్పుడామెకు ఉప్పు నీళ్ళు పట్టించాడు. ఆ రుచికి ఆమె అప్రయత్నంగా ఆ నీటిని స్వీకరించడానికి నిరాకరించడంతో తిరిగి టబ్‌లో ముంచాడు. ఆ విధంగా కొనసాగిస్తూ ఆమెతో పూర్తిగా నీళ్ళు తాగించాడు.

ఈ విధమైన సమయస్ఫూర్తి కేవలం మెడిసిన్ చదవడం వల్ల రాదు. అందులోనూ అతడు డాక్టరీ పూర్తి చేయలేదు కూడా. అయితే కేవలం సమయస్ఫూర్తి తప్ప, అందులో ప్రొఫెషెన్సీ లేకపోవటంతో అతడొక తప్పు చేశాడు. ఈ విషయం ***అయిదు నిమిషాల తరువాత*** అతనికి తెలిసింది.

సాల్ట్ వాటర్‌ని పూర్తిగా తాగించాక అతడు ఆమెని నేల మీద నిలబెట్టాడు. వడలిన తోటకూర కాడలా ఆమె నేలమీదకు జారిపోతోంటే, రెండు చేతులూ ఆమె వెనుకనుంచి ముందుకు పోనిచ్చి నిలబెట్టి పట్టుకున్నాడు. ఆమెతోపాటు విల్లులా ముందుకు వంగి, నాభి క్రింద ప్రాంతం నుంచి కడుపుని గట్టిగా వత్తుతూ చేతుల్ని పైకి పాకించాడు. వక్షోజాల మీదుగా గొంతు వరకూ తీసుకొచ్చి కడుపులోని పదార్థాన్ని బయటకు తీసుకురావడానికి ప్రయత్నించసాగాడు.

అయిదు నిమిషాల తరువాత అతడి ప్రయత్నం ఫలించింది. ఆమె నెమ్మదిగా తేరుకోసాగింది. కానీ అప్పుడు అతడు ఊహించని పరిణామం సంభవించింది. శ్వాసనాళికకి ఏదో అడ్డు పడినట్టు ఆమెకి వెక్కిళ్ళు ప్రారంభం అయ్యాయి, కొద్ది క్షణాల్లో శ్వాస ఆగిపోయింది.

ఆమెని అలాగే నేల మీదకు వదిలేసి అతడు మళ్ళీ క్రిందికి పరుగెత్తాడు. స్టౌమీద నీళ్ళుపెట్టి, ఒక కొత్త బ్లేడు ఆ నీళ్ళలో పడేశాడు. నీళ్ళు మరిగే లోపులో ఫ్యామిలీ డాక్టర్‌కి ఫోన్ చేసి విషయం చెప్పాడు.

అటువైపు నుంచి డాక్టర్ కంగారుగా ''వెంటనే హాస్పిటల్‌కి తీసుకెళ్ళు...'' అన్నాడు.

''అంత టైమ్ లేదు డాక్టర్‌గారూ''

''మరేం చేస్తున్నావ్?''

''ట్రెకియాస్టమీ'' అన్నాడు కార్తికేయ. ''... మీరు వెంటనే కుట్లు వేయడానికి రండి...''

''కానీ నువ్వు... '' డాక్టర్ ఏదో చెప్పబోతూంటే ఫోన్ పెట్టేసి మేడ మీదకు పరిగెత్తాడు.అప్పటికే శ్రీకళ్యాణి పరిస్థితి విషమించింది. ఊపిరితిత్తుల్లోకి గాలి పూర్తిగా ప్రవేశించక పోవటంతో శరీరం తిరిగి చైతన్యాన్ని కోల్పోయింది. ఇంకొన్ని క్షణాలు గడిస్తే ఆమె దక్కదని తెలుసు. అతడిక ఆలస్యం చేయలేదు. బ్లేడుని ఆమె కంఠంమీద పెట్టి నిలువుగా గీశాడు.

రక్తం బుస బుసా పొంగింది.

సరీగ్గా అరనిముషం తరువాత అతడు ఆమె కంఠనాళాన్ని నిరోధిస్తూన్న అడ్డు తొలగించ గలిగాడు. ఉబికి వస్తూన్న రక్తానికి చెయ్యి అడ్డుగా పెట్టి, శరీరం మీద బ్లాంకెట్ కప్పాడు. అంతలో క్రింద డాక్టర్ వచ్చిన చప్పుడైంది. మిగతా పనివాళ్ళకి పైన ఏదో జరిగిందని అప్పుడర్థమై, కలకలం మొదలైంది. డాక్టర్ హడావుడిగా పైకి వచ్చాడు.

''నీడిల్స్ తెచ్చారా?''

''తెచ్చాను'' డాక్టర్ చెప్పాడు. అతను పక్కకి తప్పుకున్నాడు. డాక్టర్ కుట్లు వేయసాగాడు. ఆ పని పూర్తయ్యాక ఆయన అన్నాడు. ''ఈ ఇల్లు వదిలి పెట్టమని ఎప్పుడో చెప్పాను. మొన్న మొదటి అరిష్టం జరిగింది. ఇప్పుడిక ఇది. అయినా కళ్యాణిగారి వళ్ళంతా తడిసి ఉందేమిటి? కొన్ని దెయ్యాలు అంతే. అవి పూనితే వళ్ళు భగభగ మండిపోతుంది. అందుకే అర్ధరాత్రి స్నానానికి ఉపక్రమించి ఉంటారు.''

కార్తికేయ నిశ్శబ్దంగా ఆయన వైపు చూశాడు. మాట్లాడటం అనవసరం. 'చదువు' అవివేకాన్ని పోగొడుతుందనుకోవటం కూడా అవివేకమే.

బేసిన్ దగ్గర చేతులు కడుక్కుంటూ ''మీరిక్కడ ఈ టైమ్‌లో ఉండటం అదృష్టం. మీరు కళ్యాణిగారికి ఏమవుతారు?'' అని అన్నాడు డాక్టరు.

''ఇక్కడ నేను పని చేస్తున్నాను.''

''శ్రీకళ్యాణి స్వంత డాక్టర్‌ని ఎప్పుడు ఏర్పాటు చేసుకున్నారు?'' ఆశ్చర్య పోయాడు.

''నేను డాక్టర్ని కాదు. వంట మనిషిని.''

సగం తెరచిన డాక్టర్ నోరు అలాగే ఉండిపోయింది.

'సమయస్ఫూర్తితో ఆపరేషన్ చేసి ప్రముఖ పారిశ్రామికవేత్తని రక్షించిన డాక్టర్''

అన్న హెడ్డింగ్ తో పేపర్ ఆమె ముందు ఉన్నది. ''మీకు నా కృతజ్ఞతలు ఎలా చెప్పుకోవాలో అర్థంకావటం లేదు డాక్టర్ గారూ..!'' అంది శ్రీకళ్యాణి. ఆమె ప్రస్తుతం నగరంలో కెల్లా ఖరీదైన ఆస్పత్రిలో ఉంది. ఎమర్జెన్సీ స్థితి దాటిపోయాక, క్షణాల్లో ఆ వార్త బయటకు పొక్కింది. ఆమెని వెంటనే ఆస్పత్రికి తీసుకువెళ్ళటం, ముందుగా ఊపిరి సరి చేయటం, ఆ తరువాతి రోజు నుంచీ ఊపిరి సలుపుకోనివ్వకుండా విజిటర్సూ... అంతా కోలాహలంగా మారింది. 'తొందరలో మీరు కోలుకోవాలి' అన్న గ్రీటింగులతోనూ, పూలగుత్తులతోనూ ఆమె గది నిండిపోయింది. ఈ హడావుడి తగ్గిన తరువాత ఆమె తన ఫ్యామిలీ డాక్టరుతో ''తెలుసుకోవాలనే ఉత్సాహంతో ఊరికే అడుగుతున్నాను. ఆ స్థితిలో ఇంట్లో ఆపరేషన్ కాకుండా నన్ను హాస్పిటల్‌కి తీసుకువెళ్ళి ఉంటే బ్రతికేదాన్ని కాదా?'' అని అడిగింది.

''ఛాన్స్ తక్కువ. క్షణాల్లో చెయ్యవలసిన ఆపరేషన్ అది.''

''గాడ్. తల్చుకుంటేనే భయం వేస్తోంది. అదే జరిగి ఉంటే ఇప్పుడిలా మీతో మాట్లాడుతూ ఉండి ఉండేదాన్ని కాదన్నమాట. ఆపరేషన్ చిన్నదైనా క్షణాల్లో దాన్ని చేసి ప్రాణాలు నిలబెట్టినందుకు మీకు లక్ష రూపాయలిచ్చినా పూర్తి ఫీజు చెల్లించినట్టు కాదు.''

డాక్టర్ మొహమాటంగా నవ్వాడు. ఆమె కార్తికేయ వైపు తిరిగి, ''అసలు నిన్ను అభినందించాలి. మరొక రకంగా అయితే తిట్టాలి కూడా. ఎందుకు అని అడగవేం? అఫ్‌కోర్స్... నీకు ఇలాంటి 'చిన్న–చిన్న' సందేహాలు రావు కదూ. వెంటనే డాక్టర్‌కి ఫోన్ చేసినందుకు అభినందించాలి..! కానీ అంత సీరియస్ అయినప్పుడు వెంటనే హాస్పిటల్‌కి తీసుకు వెళ్ళకుండా తీరిగ్గా డాక్టర్ కి ఫోన్ చేసినందుకు తిట్టాలి..!" అని ఆగి, డాక్టర్ ఆగమేఘాల మీద రాకుండా ఉండి ఉంటే ఏం జరిగి ఉండేది?'' అంది.

''అంత టైమ్ లేదు మాడమ్'' అన్నాడు కార్తికేయ.

''ఆ విషయం నిర్ధారించాల్సింది నువ్వు కాదు. డాక్టర్... ఏం డాక్టరుగారూ? మీరు చెప్పలేదా ఆస్పత్రికి తీసుకెళ్ళమని?''

ఆమె మెచ్చుకోలు కోసం అతను వెంటనే ''ఫోన్‌లో అదే చెప్పాను'' అన్నాడు. అక్కడే అతనో తప్పుచేశాడు. అవతలి మనిషిని తనకి కావలసిన చోట... కావలసిన విధంగా ఇరికించి... మరి బైట పడలేని రీతిలో పట్టుకోవటం శ్రీకళ్యాణికి వెన్నతో పెట్టిన విద్య.

ఆ రోజు జరిగిందంతా అతి చిన్న వివరాలతో సహా  పనివాళ్ళ ద్వారా తెలుసుకుంది. తన నైటీ నేల మీద పడి ఉండటంతో బాత్‌టబ్‌లో తనని ముంచటం, నగ్నంగా ఉన్న తనని అతడు తీసుకెళ్ళి నీటిలో స్నానమాడించడం ఊహించి సిగ్గుతో చచ్చిపోయింది. అది పూర్తిగా సిగ్గు కూడా కాదు. కేవలం స్త్రీలకే అనుభవైకవేద్యమైన పులకరింత. మొదట్లో ఒకటి రెండు సార్లు కార్తికేయ వైపు సూటిగా చూడడానికి కూడా బిడియపడింది. కానీ ఎంతోమందితో ఎన్నో రకాలుగా 'డీల్' చేసినది అవటం వల్ల ఆ స్థితిలోంచి తొందరగా బయట పడగలిగింది.

ఆ తరువాత డాక్టర్లూ, స్నేహితులూ మాట్లాడే మాటల వల్ల నైతేనేం, పేపరులో చదివిన వార్తల వల్ల అయితేనేం జరిగినదాన్ని కొత్త రూపంలో విన్నది. వాళ్ళు చెప్పిన దాన్ని బట్టి... తనకి అపాయం జరిగిన వెంటనే డాక్టరు ఆగమేఘాలమీద వచ్చి ఆపరేషన్ చేసి రక్షించాడు. ఇదీ వార్త. అదే జరిగితే మరి తన స్నానం మాట ఏమిటి?

కార్తికేయ డాక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడుతున్నప్పుడు, ఆ సంభాషణ విన్న పనివాళ్ళు తు.చ. తప్పకుండా దాన్ని శ్రీకళ్యాణికి చెప్పారు. ''కుట్లు వేయడానికి వెంటనే రండి'' అని కార్తికేయ అన్నాడు. ఇంకేదో ఇంగ్లీషు పదం కూడా వాడాడు.

ఏ విషయమైనా వివరాల్తో సహా తెలుసుకోవటం ఆమె అలవాటు. కోట్లతో డీల్ చేసేటప్పుడు ఆమెకు ఆ రకంగా అలవాటయింది. కొంచెం పలుకుబడి, మాటకారితనం ఉంటే ఒకరికి రావలసిన కీర్తిని మరొకరు సునాయాసంగా కొట్టెయ్యడం చాలాచోట్ల జరిగేదే. అదే జరిగిందా? ఆ విషయం తెలుసుకోవటానికే ఇప్పుడు డాక్టర్‌ని ఈ విధమైన సంభాషణలోకి దింపింది. ఆమె ఎటు లీడ్ చేస్తుందో తెలీని డాక్టరు, 'నేనూ ఫోన్‌లో అదే చెప్పాను. ఆస్పత్రికి తీసుకు రమ్మని' అన్నాడు.

''దానికో అయిదు నిమిషాలు పట్టి ఉండేది. అంతసేపు నేను బ్రతికేదాన్నా'' ఏమీ తెలియనట్టు అడిగింది. డాక్టర్ తబ్బిబ్బయి సమాధానం కోసం వెతుకుతోంటే చప్పున సమాధానం తట్టింది. ''అంతకాలం కష్టం. అందుకే నేను వెంటనే బయల్దేరి వచ్చాను'' అన్నాడు.

''నేను ప్లాస్టిక్ సర్జన్‌తో మాట్లాడాను. ఈ గొంతుమీద గాటు తాలూకు మచ్చ కనబడకుండా చెయ్యొచ్చునన్నాడు. ఇంకా రెండు వారాల తరువాత సర్జరీ చేస్తాడట'' అంది. ఎవరూ మాట్లాడ లేదు. తిరిగి మళ్ళీ ఆమె అంది. ''సర్జన్ ఈ గాటు పరీక్షించి, 'ఎవరో చాలా నాటు పద్ధతిలో గాటు పెట్టారు. ఈ మచ్చ మాయటానికి కొంచెం కష్టమైన ఆపరేషన్ చెయ్యాలి' అన్నాడు. 'సరయిన టైమ్‌లో ఏదీ దొరక్క మా డాక్టర్‌గారు గొప్ప సమయస్ఫూర్తితో బ్లేడ్‌తోనే ఆపరేషన్ చేశారు' అని నేను చెప్పాను. నేను చెప్పింది నిజమేనా డాక్టర్?''

''అక్షరాలా నిజం.''

ఆమె నవ్వి ''బ్లేడ్‌ని కనీసం వేణ్ణీళ్ళలో మరిగించారా?'' అని అడిగింది.

డాక్టర్ కొంచెం తడబడి, ''ఆ... ఆ... జాగ్రత్తలన్నీ తీసుకున్నాను'' అన్నాడు.

''మీకు ట్రెకియాస్టమీ చెయ్యాలని ఎందుకనిపించింది?''

''అదేమిటి కళ్యాణిగారూ. మీరు శ్వాస ఆడక గిలగిల కొట్టుకుంటూంటే...'' అంటున్న అతడి మాటల్ని మధ్యలో ఆపుచేసి, ''... ఇంటి నుంచి బయల్దేరే ముందే ట్రెకియాస్టమీ చెయ్యాలని తెలుసా? ఆ నిర్ణయం ఇక్కడికి వచ్చాక తీసుకున్నారా?''

''పేషెంట్ పరిస్థితి ఏమిటో ఫోన్‌లో ఇతను చెప్పగానే, దానికి ఏం చెయ్యాలో వెంటనే నాకు తెలిసిపోయింది'' గర్వంగా చెప్పాడు.

అప్పుడామె ఆఖరి ప్రశ్న వేసింది. ''ట్రెకియాస్టమీ చేయటానికి వస్తూ కుట్లు వేయడం కోసం నీడిల్స్ తెచ్చిన మీరు, గొంతుకు రంధ్రం చేయటానికి కత్తి ఎందుకు తేలేదు? బ్లేడ్ ఎందుకు ఉపయోగించ వలసి వచ్చింది?''

చీమ చిటుక్కుమంటే వినపడేటంత నిశ్శబ్దం ఆ గదిలో వ్యాపించింది. డాక్టర్ మొహం రక్తం లేనట్టు తెల్లగా పాలిపోయింది. చేతులు నులుముకుంటూ నిలబడ్డాడు. ఆమె తన పక్కనున్న లోకల్ న్యూస్ పేపర్ అతడి ముందుకు తోస్తూ... ''సమయస్ఫూర్తితో ఆపరేషన్ చేసి ప్రముఖ పారిశ్రామికవేత్తని రక్షించిన డాక్టర్' అని పెద్ద పెద్ద అక్షరాల్తో ప్రచురించిన ఈ జర్నలిస్టుకి ఇంత చిన్న అనుమానం ఎందుకు రాలేదో'' అంది.

''అది కాదు మేడమ్–'' డాక్టర్ ఏదో చెప్పబోయాడు. కళ్యాణి ''...ఇక మీరు వెళ్ళవచ్చు'' అంది కటువుగా. అతడు తల వంచుకొని వెళ్ళిపోయాడు.

ఆమెతో బాటు కార్తికేయ ఒక్కడే మిగిలిపోయాడా గదిలో. ఆమె మొహం ఇప్పుడు ప్రసన్నంగా ఉంది.

''నువ్వు నాకెందుకు అబద్ధం చెప్పావ్?'' అని అడిగింది.

అతడు విస్తుబోయి, ''అబద్ధమా?'' అన్నాడు.

''నీ చదువు విషయంలో''

''నేను కరెక్టే చెప్పాను మాడమ్. ఇంటర్మీడియట్ చదివాను. ఆ తరువాత మెడిసిన్ నాలుగు సంవత్సరాలు చదివి మానేశాను. ''

ఆమె విస్తుబోయింది. 'మెడిసిన్' కూడా మధ్యలో... అదీ ఆఖరి సంవత్సరంలో మానేస్తారని ఆమెకు తెలీదు. ఆశ్చర్యాన్ని దాచుకోకుండా ''ఎందుకు?'' అని అడిగింది.

''డబ్బు లేక ''

ఆమె చాలాసేపు మాట్లాడ లేదు. ఒక నిరామయ నిర్లిప్తావస్థలో ఉన్నట్టు చాలాసేపు అలాగే ఉండి స్వగతంగా ''అంత వరకూ చదివినవాడివి ఇంకొక్క సంవత్సరం చదివించలేకపోయారా మీ తల్లిదండ్రులు. బ్రతికే ఉన్నారా?'' అని అడిగింది.

''లేరు''

''ఇప్పుడు కాదు. మీరు ఫైనల్ ఇయర్ కొచ్చినపుడు.''

''ఉన్నారు.''

''ఉన్నారా?''

ఆమె మరింత ఉద్విగ్నురాలై, ''మరెందుకు చదివించలేదు? ఓ... డబ్బులేక అన్నారు కదూ. ఎంత డబ్బు లేకపోయినా, ఫైనలియర్ మెడిసిన్ చదువుతున్నవాడి చదువు ఆపుచేస్తారా? కడుపు మాడ్చుకునైనా పెడతారే. మీ తండ్రి ఎవరు? ఏం చేసేవారు?'' అని అడిగింది.

అతడు చెప్పిన జవాబు విని ఆమె అదిరిపడింది. ఆమె గొంతు కీచుగా ధ్వనించింది. ''జమిందార్ జగదీష్ మీ తండ్రా?'' ఎగ్జయిటింగ్‌గా అంది.

అతడు తలూపాడు.

''అయినా కూడా డబ్బులేక మీ చదువు ఆగిపోయిందా?''

అతడు సమాధానం చెప్పలేదు.

''ఐ యామ్ సారీ...'' కోపంగా అంది.

అతడు తల దించుకున్నాడు.

''ఎందుకని అడగరేం?''

''అలాటి తండ్రికి కొడుకుగా పుట్టినందుకు'' కరుగ్గా అంది.

అతడు చప్పున తలెత్తాడు. ఆమె కొనసాగించింది. ''మీ తండ్రి గురించి నేను విన్నాను. లక్షల లక్షల ఆస్తి ఉంచుకుని కన్న కొడుకుని ఒక సంవత్సరం చదివించ లేకపోయాడా? ఉన్నదంతా ఉంచుకున్నదానికి ధారపోసి, భార్యాబిడ్డల్ని నడిబజారులో బిచ్చమెత్తుకునేలా చేస్తాడా? చివరకా ప్రియురాలు ఇతగాడిని బికారిని చేసి వీధిలోకి తోసేస్తే మళ్ళీ పెళ్ళాం బిడ్డల పంచకే చేరతాడా? మైగాడ్. తల్చుకుంటేనే భయమేస్తోంది. ప్రపంచంలో ఇలాటి మనుష్యులు కూడా ఉంటారా అనిపిస్తోంది.''

బయటేదో అలికిడి అయితే అక్కడ్నుంచి వెళ్ళబోయాడు.

''ఒక్క ప్రశ్నకి జవాబు చెపుతారా?'' అతను ఆగాడు.''మీ తండ్రి అంటే మీకు అసహ్యం వేయటం లేదూ?''

''ఆ టాపిక్ వదిలి పెట్టేయండి. దాన్ని చర్చించటం నా కిష్టం లేదు.''

ఆమె ఆవేశంగా ''ఎందుకు లేదు?'' అని అడిగింది. భావరహితమైన వదనంతో... ''కొన్ని విషయాలు చర్చించడం ఇష్టముండదు. అంతే'' అన్నాడు.

ఆమె మరింత ఆవేశం చెంది గట్టిగా ''ఇష్టం లేకపోవటం కాదు. మీకు భయం. మీ మనస్తత్వం నాకు బాగా అర్థమైంది. మీకు జీవితంలో గానీ, సమస్యలతో గానీ, ఎదుటి వ్యక్తులతో గానీ పోరాడటం చేతకాదు. సమస్యలంటే భయం. వాస్తవమంటే భయం. మీకు డబ్బు సంపాదించటం చేతకాదు. ఒక రకంగా చెప్పాలంటే డబ్బు సంపాదించటానికి కూడా ధైర్యం, తెగింపు, పోరాడే గుణం ఉండాలి. అవే మీకు లేవు. చాలామందికి అవి ఉండవు కూడా. అందుకనే వారు మన్నుతిన్న పాములా సామాన్యంగా బ్రతికేస్తూ ఉంటారు. కానీ మీరు తెలివైనవాళ్ళు. మీ పిరికితనానికి, ఆవేశరహిత గుణానికి మంచి మంచి పేర్లు పెట్టుకున్నారు. గొప్ప గొప్ప సిద్ధాంతీకరణలు చేసుకున్నారు. 'నేను అబద్ధం చెప్పను' 'నేను నిజాయితీపరుణ్ణి' 'నాకు కోపంగానీ, ఆవేశంగానీ రావు' లాంటి ఆత్మవంచనలతో మిమ్మల్ని మీరు మోసం చేసుకుంటున్నారు. ఎడారిలో లక్ష రూపాయలు దొరికిన మనిషి తిరిగి తీసుకువచ్చి ఇవ్వటంలో నిజాయితీ ఉంది. కానీ దాన్ని దొంగిలిస్తే పోలీసులకి దొరికిపోతానేమో అన్న భయం కూడా ఉంది. ఆ రోజు మీకు గుర్తుందా? నా చెప్పులు తెగిపోయినప్పుడు పది రూపాయలిచ్చి కుట్టించుకు రమ్మంటే, కుట్టటానికి ఖర్చు ఆరు రూపాయలయిందని మూడు నా చేతిలో పెట్టారు. ఎందుకలా చేశారో నాకు తెలుసు. కుట్టించుకు వచ్చినందుకు మీ ఛార్జ్ 'ఒక్క రూపాయి'. నిజానికి మీరు ఏ లెక్కా చెప్పకపోయినా నేనేమీ అనుకోను కానీ, మీ నిజాయితీతో పాటు, డబ్బు విషయంలో మీరు ఎంత కరెక్టుగా ఉంటారో నాకు తెలియాలని మీ ఉద్దేశ్యం. అక్కడే కనపడుతున్నాయి మీ తెలివి తేటలు. ఇంకెవరయినా అయితే మూడు రూపాయలు తిరిగి ఇచ్చి ఊరుకునేవారు. ఎంతయిందో చెప్పేవారు కాదు. ఇప్పుడు మీ చదువు విషయంలో కూడా అంతే. మీరు డాక్టరీ చదివారన్నది ఎప్పుడో ఒకప్పుడు బైటపడుతుందని మీకు తెలుసు. అది నాకు అకస్మాత్తుగా తెలియాలని మీ ఉద్దేశ్యం. నేను థ్రిల్ అవ్వాలి. అప్పుడు నా సంబోధన 'నువ్వు' లోంచి 'మీరు' లోకి మారాలి. అవునా? అవునని మీరు ఒప్పుకోలేరు. అసలు మీరు వాదించలేరు. నేను చెప్పాగా. వాదించటానికి ధైర్యం కావాలి. పది మందితో వంద రకాలుగా డీల్ చేయగలవాడే డబ్బు సంపాదించగలడు! వంద రకాల ప్రయత్నాలు చేయగలవాడే కృషితో కీర్తి సంపాదించగలడు. కోపం, ఆవేశం, దుఃఖం, తెగింపు మనిషి సహజ గుణాలు. అన్నీ కొన్ని కొన్ని పాళ్ళలో మిశ్రమమై ఉన్నవాడే నిజమైన మనిషి. ఇవన్నీ లేనివాడు వేదాంతి కాదు. చేతకానివాడు. తన చేతకానితనానికి వేదాంతం అని పేరు పెట్టుకోవడం ఆత్మవంచన. ఒక్క మాటలో చెప్పాలంటే ఏ టెన్షనూ లేకుండా, ఎవరితోనూ ఘర్షణపడకుండా, ఏ రసస్ఫూర్తి లేకుండా బ్రతకటం అనవసరం. అసలు జీవితమే ఒక పెద్ద వ్యాపారం. ఏ లాభమూ లేకపోతే ఇక జీవించటం ఎందుకు అని నా ఉద్దేశ్యం. మీరేమంటారు?''

''ఏమంటాను మాడమ్? యజమానులు తమ వంటవాళ్ళతో ఇంతసేపు వాదించటంలో ఏ లాభమూ లేదంటాను'' వినయంగా అని అక్కడ నుంచి వెళ్ళిపోయాడు.

అంత దారుణంగా ఆమెని ఇంత వరకూ ఎవరూ దెబ్బ కొట్టలేదు. మనసు కుతకుత ఉడికి పోసాగింది. ఏ విషయంలో మనిషి ఫెయిల్ అవుతాడో ఆ విషయంలోనే గెలుపొందాలన్న కోర్కె ఎక్కువ అవుతుంది. ఈ 'గెలవటం' కోసం కార్తికేయ

విషయంలో ఆమె ఒక చిన్న 'ఎత్తు' వేసింది. కేవలం తన అహం సంతృప్తి కోసం ఆమె అలా మాట్లాడి అతడిని ఇరకాటంలో పడేసింది. అతడిలో కోపాన్నీ, దుఃఖాన్నీ కదిల్చి, అతడు ఆవేశంతో అరుస్తుంటే చూడాలని ఆమె కోరిక. అతడు ఆవేశం చెందకపోవడం, ఎక్కువ మాట్లాడక పోవటం ఆమెను మరింత ఇరిటేట్ చేసింది. మనుష్యులమీద తనకున్న అభిప్రాయాన్ని ఎప్పటికప్పుడు బలపర్చుకోవటం ఆమెకు అలవాటు. అందుకని మరో పని చేసింది. అనాలోచితంగా చేసిన ఆ పని ముగ్గురు జీవిత విధానాలని పూర్తిగా మార్చేసింది.

(కొనసాగింపు వచ్చే నెలలో)

Click here to share your comments